క్లుప్తంగా

ఎస్‌ఐ బదిలీ

రామకుప్పం: స్థానిక ఎస్‌ఐ కృష్ణయ్యను రొంపిచెర్లకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రొంపిచెర్ల ఎస్‌ఐ శ్రీనివాసులను ఇక్కడికి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బోయకొండ అభివృద్ధి పనుల పరిశీలన

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద చేస్తున్న అభివృద్ధి పనులను ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరిశీలించారు. తొలుత ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలలో భక్తులకు దర్శన వసతి, ఇతర సదుపాయాల కల్పన ఎలా ఉందో వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి చంద్రమౌళి, పార్టీ నాయకుడు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు



ప్రబోధానంద పుస్తకాలపై ప్రచారం చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

కుప్పం రూరల్: శ్రీ కృష్ణుడే జగద్గురువని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం మండలంలోని నూలుకుంటలో ప్రచారం చేశారు. భగవద్గీతలో ఎన్నో జీవన పరమార్థాలు దాగి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, కృష్ణారెడ్డి, శరవణ, నాగరాజు, కృష్ణ, మంజునాథ్, సుధాకర్, చరణ్, లోకేష్, జలజాక్షి, ఇందిరా, వెంకటలక్ష్మి, పూజ, యశస్విని పాల్గొన్నారు.

25న రాష్ట్ర విద్యాసంస్థల బంద్

పుంగనూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25న విద్యాసంస్థలకు బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా ఆదివారం విలేకరులకు తెలిపారు. విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బంద్ చేయనున్నట్లు చెప్పారు.

దేశమ్మ ఆలయంలో భక్తుల సందడి



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నగరి: నేత్రదేవత దేశమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి ఆడి నెల పూజలు ప్రత్యేకం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. బాలాలయంలో ఉంచిన అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థాన్ని చల్లుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తుదిదశలో శ్రీనివాస సేతు పనులు

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు పనులు తుదిదశకు చేరుకున్నాయని, ఆగస్టు మొదటి వారంలో పనులు పూర్తయి అందుబాటులోకి తీసుకువస్తామని స్మార్ట్ సిటీ ఎండీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె ఆదివారం రిలయన్స్ మార్ట్ వద్ద రైల్వే లైన్‌పై చేపట్టిన శ్రీనివాస సేతు నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ శ్రీనివాస సేతుపై పూర్తిగా ఫుట్‌పాత్, గ్రీనరీ పెంపు, జీబ్రా లైన్లు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్‌ఈ మోహన్, ఆప్కాన్స్ ప్రతినిధి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

డేంజర్.. యమ డేంజర్!

- హైవే, పట్టణంలో హడలెత్తిస్తున్న బైక్ రైడర్లు
- సైలెన్సర్‌లో మఫ్లర్ తీసేసి రైడింగ్
- చెవులు తూట్లు పడేలా దూకుడు డ్రైవింగ్
- జనం, మహిళలు, విద్యార్థినుల మీదకు వెళ్తూ ఓవరాక్షన్
- హైవేలలో మితిమీరిన వేగంతో రేసింగ్ పందేలు



బైక్‌పై విన్యాసాలు చేస్తున్న యూత్ (ఫైల్)

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీతోపాటు మండల కేంద్రాల్లో బైక్‌రైడర్ల ఆగడాలు శృతిమించుతున్నాయి. సైలెన్సర్‌లోని మఫ్లర్‌ను తొలగించి, అధిక శబ్దంతో జనం, మహిళలు, విద్యార్థులకు మీదకు దూసుకుపోతూ హడలెత్తిస్తున్నారు. ఇక హైవేలోని బైపాస్ రోడ్లలో బైక్ రైడింగ్ బెట్టింగ్‌లతో నువ్వా? నేనా? అనే లెవెల్లో రైడర్లు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు.

ఎందరో ప్రమాదాల బారిన..

మితిమీరిన వేగంతో బైక్‌లను నడపడంతో ప్రమాదాలకు గురై పలువురు యువకులు, కళాశాల విద్యార్థులు ఎనిమిదిమంది వరకూ గత ఐదేళ్లలో మృత్యువాత పడ్డారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

కళాశాలలు వదిలే సమయంలో..

పలమనేరులోని కళాశాల నుంచి విద్యార్థినులు ఇళ్లకు వెళ్లే సమయంలో పదుల సంఖ్యలో బైక్ రైడర్లు వారి దృష్టిని ఆకర్షించేందుకు విన్యాసాలకు తెగబడుతున్నారు. విద్యార్థినుల మీదకే వెళ్లినట్టు వెళ్లి పక్కకు తిప్పడం, ఆపై వెకిలిచేష్టలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇక కళాశాలల నుంచి గ్రామాలకు వెళ్లే కాలేజీ బస్సులు, ఇతర వాహనాలపై వెనుక వెళుతూ ఫీట్లు చేస్తున్నారు. ఇక రాత్రి పదిగంటలు దాటితే స్థానిక మెయిన్‌రోడ్డుపై వీరి ఆగడాలు అన్నీ ఇన్నీకావు.

మండల కేంద్రాల్లో మరీ ఎక్కువ

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె, వి.కోట మండల కేంద్రాల్లో ఎక్కువ శబ్దం చేసే బైక్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు, పుంగనూరు రోడ్డు ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 దాకా సాయంత్రం 4 నుంచి రాత్రి 12దాకా వీరి ఆగడాలకు హద్దులేకుండా పోయింది. ఉదయం పూట నాలుగురోడ్ల సమీపంలోని గార్మెంట్స్‌కు వెళ్లే మహిళలు వందల సంఖ్యలో చెక్ పోస్టులో ఉంటారు. వారిని చూసి రైడర్లు మరీ రెచ్చిపోతున్నారు.

రాత్రిపూట బెట్టింగ్‌లు

ఇక బైక్ రైడింగ్ బెట్టింగులు సైతం ఇక్కడి హైవేలో సాగుతున్నాయి. కొందరు రైడర్లు అతిగా మద్యం సేవించి మరీ డ్రైవ్ చేస్తున్నట్టు సమాచారం. మరికొందరు బైక్‌లను కేవలం ఓ చక్రంపై నడపడం కూడా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బెంగళూరు నుంచి పలమనేరు దాకా కర్ణాటకలోని బెంగళూరు, హోసకోటకు చెందిన పలువురు యువకులు టైమింగ్ ఛేజ్ పేరిట పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం ఉంది. ఈ బెట్టింగులలో మొదటి బహుమతి రూ.లక్ష అట! ఇలా ఉండగా 2022లో మొత్తం 711 రోడ్డు ప్రమాదాలు జరగ్గా వీరిలో 366మంది మృతిచెందారు. వీరిలో 10మందికిపైగా వేగంగా బైక్‌ను నడిపిన యువకులే కావడం గమనార్హం! ఇక గాయపడిన 366మందిలో 60మంది కళాశాల విద్యార్థులు, యువకులే కావడం గమనించతగ్గ అంశం.

బాధ్యత వహించాలి



పట్టణంలో కాలేజీలు వదిలే సమయంలో కొందరు యువకులు బైక్‌లపై వేగంగా వెళ్తున్నారు. ఇక బైపాస్‌లో రేసింగ్‌లు జరుగుతూనే ఉన్నాయి. వేగంగా వెళ్లి పలువురు యువకులు మృతి చెందుతున్నా ఎవరూ భయపడడం లేదు. ఇష్టానుసారంగా రైడింగ్ చేస్తున్నారు. దీనిపై రవాణా, పోలీసు శాఖలే కాదు తల్లిదండ్రులు సైతం బాధ్యతగా తీసుకోవాలి.

–ముజ్జు, పలమనేరు

బైక్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి



పలమనేరుతో పాటు మండల కేంద్రాల్లో బైక్ రైడింగ్‌లు, విన్యాసాలు, బెట్టింగులపై సమాచారం ఉంది. బైక్ రేసర్లనుని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించాం. ముఖ్యంగా జనావాసాల్లో హంగామా చేసే రైడర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం. వీరి ఆట కట్టిస్తాం.

–సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ, పలమనేరు

దూరం.. సేవకు కాదు భారం

వలంటీర్లకు వందనం

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల వలంటీర్లపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయన మాటలపై వలంటీర్ల లోకం భగ్గుమన్నా, రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తం చేసినా ఆయన తీరు మారకపోగా, మరింత ఆజ్యం పోసేలా విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. అలాగే, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సైతం వలంటీర్ల సేవలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరి కలయిక ఏ ప్రయోజనాల కోసమో అందరికీ తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై ప్రజలు సైతం మండిపడుతున్నా నిస్సిగ్గుగా ఇప్పటికీ వారిద్దరూ వలంటీర్లపై విషం చిమ్ముతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలపై కథనం.

బైరెడ్డిపల్లె: వైఎస్సార్‌సీపీ అధికారంలో కొచ్చిన ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ప్రజల ముంగిటకే సేవలు, పథకాల ఫలాలు అందిస్తున్న వైనాన్ని జాతీయ చానళ్లు సైతం ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. ప్రభుత్వం–ప్రజలకు నడుమ వలంటీర్లు వంతెనలా పనిచేస్తున్నారని ప్రజలు సైతం పొగడుతున్నా జనసేన, టీడీపీ అధినేతకు మాత్రం బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారు. కరోనా సమయంలో కాదు; ఇప్పుడు కూడా వలంటీర్లు ఎనలేని సేవలు అందిస్తున్నారు. బైరెడ్డిపల్లెకు చెందిన వలంటీర్ సుబ్రమణ్యం తన పరిధిలోని సామాజిక పింఛనుదారులకు తెల్లవారకమునుపే పింఛన్ ఇవ్వడమే కాకుండా తనవంతు సేవలు అందిస్తున్నాడు. ఈ క్రమంలో 2021లో లక్ష్మమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో క్రిష్ణగిరి ఆసుపత్రిలో చేరింది. ఇది తెలుసుకున్న సుబ్రమణ్యం 110 కిలోమీటర్లు దూరం వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు.



క్రిష్ణగిరి ఆస్పత్రిలో లక్ష్మమ్మకు నగదు అందజేస్తున్న వలంటీర్ సుబ్రమణ్యం

వలంటీర్ సేవలు అభినందనీయం



క్రిష్ణగిరి ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడ్డా. ఆ సమయంలో సుబ్రమణ్యం సొంత ఖర్చులతో ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందజేశాడు. అది వైద్య ఖర్చులకు ఉపయోగపడింది.

–లక్ష్మమ్మ, బైరెడ్డిపల్లె

చంద్రమౌళి సేవలు మరువలేనివి



శాంతిపురం : చంద్రమౌళి చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న నాయకులు



కుప్పం మున్సిపల్ కార్యాలయంలో..



రామకుప్పంలో..

శాంతిపురం/రామకుప్పం/కుప్పం: వైఎస్సార్ సీపీ దివగంత నాయకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ చంద్రమౌళి పార్టీ కోసం చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు స్మరించారు. చంద్రమౌళి జయంతి పురస్కరించుకుని ఆదివారం శాంతిపురం, రామకుప్పం, కుప్పంలో ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి మాట్లాడారు. విపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకుల తప్పుడు కేసులు, వేధింపుల నుంచి పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూ ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసిన ఘనత ఆయనకే దక్కిందని, ఐఏఎస్ అధికారిగా తనకు ఉన్న పరిచయాలతో వందల మంది సమస్యలను పరిష్కరించారని గుర్తు చేసుకున్నారు. కుప్పంలో పార్టీ అభ్యర్థులను గెలిపించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణమూర్తి, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నాయకులు టివి పట్టాభి, నిసార్, ఏవీ జయరాం, రామకృష్ణారెడ్డి, చలం, ఆర్ముగం, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ చంద్రమౌళి, రామకుప్పం మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం రామకుప్పం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షుడు అప్పి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

గంగవరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు సోమవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ ప్రతాపెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: వివిధ మద్యం కేసుల్లో సీజ్ చేసిన ఏడు మోటర్ సైకిళ్లను 24వ తేది సోమవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పోలీసు స్టేషన్‌లో చిత్తూరు ఏఈఎస్ అధ్వర్యంలో వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఆసక్తి కలవారు వేలంలో రూ.2వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని చెప్పారు.

26న పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ నూతన భవనం

బైరెడ్డిపల్లె: గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నాడు–నేడుతో పీహెచ్‌సీలను బలోపేతం చేస్తోంది. స్థానిక పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత ఏడాది ఆగష్టులో నాడు–నేడు కింద రూ.1.5 కోట్లతో నూతన భవన నిర్మాణానికి పూనుకున్నారు. ప్రస్తుతం పనులు పూర్తవడంతో 26న రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఈ నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్టు వైద్యాధికారి విజయచంద్ర తెలిపారు. రోగులకు 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి రావడమే కాకుండా గర్భిణులకు కాన్పులు చేయడానికి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

సేవ్ మణిపూర్



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

–క్రైస్తవుల నిరసన శాంతి ర్యాలీ

పలమనేరు: అరాచక పాలకు నిలయంగా మారిన మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించి, అక్కడ శాంతిని నెలకొల్పాలని పలమనేరుకు చెందిన క్రైస్తవులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్ రోడ్డు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు క్రైస్తవులు 'సేవ్ మణిపూర్' పేరిట శాంతి నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ, మణిపూర్‌లో జరిగిన అమానవీయ, హేయమైన సంఘటన దేశ ప్రజానీకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాల ముందు తలదించుకోవాల్సిన పరిస్థితి తెచ్చిందన్నారు. మహిళలపై దారుణ కృత్యాలు పునరావృతం కాకుండా కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు క్రైస్తవులు బ్యానర్లతో ప్రదర్శన చేతబట్టి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మణిపూర్ ఘటనపై నిరసన

పలమనేరు: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన మానవ మృగాలు, రాష్ట్రంలోని ఒంగోలులో గిరిజనునిపై మూత్రవిసర్జన చేయడాన్ని ఖండిస్తూ స్థానిక కుల వివక్ష పోరాట సమితి నాయకులు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, దేశంలో అరాచకాలు పెట్రేగిపోతుంటే కేంద్రంలోని బీజేపీ మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. దేశానికి రక్షణగా నిలిచిన సైనికుడి భార్యకే ఈ దేశంలో రక్షణ లేనప్పుడు సామాన్య మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. రెండు ఉదంతాల్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గిరిధర్ గుప్తా, పాదం సుబ్రమణ్యం, పూజారి నరసింహులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని కె.నక్కనపల్లెలో జెడ్పీ నిధులతో వేసిన తాగునీటి బోరును చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు తాగునీటి సమస్యను తన దృష్టికి తేవడంతో స్పందించి బోరు వేయించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము అంకితమయ్యామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చలపతి, ఎంపీటీసీ ఆనంద్, వైస్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చంగప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ పురోహిత్ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న రామమూర్తి

పుంగనూరు: రేణిగుంట సమీపంలోని శ్రీరాజరాజేశ్వరి జ్ఞానపీఠంలో రాష్ట్ర బ్రాహ్మణ పురోహిత్ మహాసభ, వేదస్మార్త పరీక్షలు ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పురోహిత్ సంఘం జిల్లా గౌరవ సలహాదారు కె.రామమూర్తి తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో బ్రాహ్మణ పురోహిత్ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలకు 250 మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. పరీక్షల్లో పాల్గొనే వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పురోహితులు తప్పక పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం సభ్యులు అగస్త్యేశ్వరదీక్షిత్, ఆర్.కె.రామకృష్ణ, మధుకుమార్, అశ్వర్థనారాయణ, గిరి, శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, నారాయణ, చంద్రశేఖర్‌శాస్త్రి, భుజింగరావు, శశిశేఖర్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం





శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణతో తిమ్మరాయస్వామి

కుప్పం: పట్టణం సమీపంలో గుత్తార్లపల్లెలోని తిమ్మరాయస్వామి దేవాలయానికి కుంభాభిషేకం నిర్వహించి 40 రోజులు కావడంతో ఆదివారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి గణపతి హోమం, పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మంగళహారతి ఇచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. అలాగే స్వామి వారికి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు దంపతులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరయ్యారు. రాత్రి శ్రీనివాస భూదేవి విగ్రహాలను గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.



హాజరైన భక్తులు

ఉచిత నేత్ర శిబిరానికి స్పందన



కంటి రోగులను పరీక్షిస్తున్న నేత్ర వైద్య నిపుణులు

గంగవరం: లయన్స్ క్లబ్ నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. పలమనేరులోని వేలాయుధం జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యుల సహకారంతో ఆదివారం కుప్పం పీఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. మొత్తం 93 మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. వైద్యపరీక్షలు చేసి 12మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్టు క్లబ్ ప్రెసిడెంట్ రఘు తెలిపారు.

120 మంది ఉచిత కంటి పరీక్షలు

కుప్పం రూరల్: సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారదా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు చేసినట్లు ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు చెప్పారు. ఇందులో 34 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారని, వీరికి బెంగళూరులో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్టు చెప్పారు. శిబిరంలో వైద్యులు మహదేవ్, బాబు రోగులను పరీక్షించారు.

నేటి నుంచి గడప గడపకు..

పెద్దపంజాణి: మండలంలోని ముత్తుకూరు, లింగాపురం గ్రామ పంచాయతీలలో సోమవారం, మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగా రెడ్డి తెలిపారు. సోమవారం నెర్నిపల్లె, ముత్తుకూరు 25న పోలేపల్లె, బ్రాహ్మణపల్లె, గడ్డంవారిపల్లె, రేకులకుంట, జోగిండ్లు, లింగాపురం, వి.ఏ. కొత్తూరు, మట్టగానిపల్లె, దాసనంపల్లెలో ఎమ్మెల్యే పర్యటిస్తారని వివరించారు.

విద్యార్థులకు వేమన పద్యాల పుస్తకాలు



నీతి పుస్తకాలతో పాఠశాల చిన్నారులు

పలమనేరు: గంగవరం మండలంలోని గొర్రెలదొడ్డి గ్రామ ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పట్టణానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆదివారం వేమన నీతి పద్యాల పుస్తకాలను పంపిణీ చేశారు. పిల్లల్లో మానవీయ విలువలు, నీతిని పెంపొందించేందుకు వీటిని అందజేసినట్లు చెప్పారు. హెచ్ఎం దినేష్ రెడ్డి, పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న డ్రాగన్ ఫ్రూట్





రెడ్డివారిపల్లెలో డ్రాగన్ ఫ్రూట్ సాగు, (ఇన్‌సెట్) ట్రేలలో ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్

ఐరాల: ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన డ్రాగన్ ఫ్రూట్ రైతులకు సిరులు కురిపిస్తోంది. ఐరాల మండలం రెడ్డివారిపల్లెకు చెందిన రాజారెడ్డి ఎకరా పొలంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. కడపలో ఒక్కో మొక్క రూ.100కు కొనుగోలు చేసి సాగుకు శ్రీకారం చుట్టారు. రెండేళ్ల క్రితం డ్రాగన్ ఫ్రూట్ రెడ్ రకం 2వేల మొక్కలను తెప్పించి నాటారు. చెట్ల మధ్య 8 అడుగులు, సాళ్ల మధ్యలో 10 అడుగుల దూరంలో సిమెంట్ స్తంభాలు నాటి, స్తంభానికి నాలుగు మొక్కలు నాటారు. స్తంభం పైభాగంలో మొక్కలకు ఆలంబనగా పాత టైరును అమర్చారు. మొత్తం మీద పంటకు మొదటి సంవత్సరం మొక్కల ఖర్చు, సిమెంట్ స్తంభాలు, టైర్లతోపాటు ఎకరాకు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. డ్రిప్ ద్వారా పది రోజులకోసారి నీటి తడులు ఇస్తున్నారు. ఎకరాకు మొదటి ఏడాది 3 నుంచి 5 టన్నుల వరకు, రెండవ సంవత్సరం 5 నుంచి 9 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. తద్వారా మొదటి సంవత్సరం రూ.5.5లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అదే రెండో సంవత్సరం నుంచి రూ.9 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆ రైతు చెబుతున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ



ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. కరోనా సమయంలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందాలంటే డ్రాగన్ ఫ్రూట్ తీసుకుంటే మంచిదని, దీనిలో ఆరోగ్యానికి మేలు చేసే పోషక విలువలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారంలోకి వచ్చింది. అందువలన ప్రజల దీనిపై ఆసక్తి పెంచుకున్నారు. ప్రస్తుతం మా వద్దకే వచ్చి వినియోగదారులు కిలో రూ.180 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.

–రాజారెడ్డి, రైతు, రెడ్డివారిపల్లె, ఐరాల

ప్రత్యేక సంచిక

ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. రాష్ట్ర వైస్ చైర్మన్, డైరెక్టర్ శ్రీ ఎం.సి.విజయానంద రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు

జగనన్న జెండా.. విజయానికి అజెండా!

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి జగనన్న వెంటే పయనిస్తూ. అధినేత అడుగులో అడుగు వేస్తూ.. కష్టనష్టాల్లో తోడుగా నడుస్తూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ.. కార్యకర్తలకు అండగా నిలబడుతూ.. నమ్మకంగా పార్టీ జెండాను మోస్తూ.. జన హితమే అజెండాగా ముందడుగు వేస్తూ.. అవిశ్రాంతంగా.. అహర్నిశలు శ్రమిస్తున్న బడుగుల బంధువు ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి. నేడు ఆయన పుట్టినరోజు నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- పేదల అభ్యున్నతే లక్ష్యంగా సేవలు
- విద్యార్థులకు చేయూత.. రైతులకు ఆర్థిక భరోసా
- యువతకు ఉద్యోగావకాశాల కల్పన
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న విజయానందరెడ్డి


సీఎం జగన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విజయానందరెడ్డి


రంజాన్‌తోఫా పంపిణీలో మంత్రి పెద్దిరెడ్డి, విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి.. ఈ పేరే ఆయన బలం. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేదల కోసం రూపొందిస్తున్న సంక్షేమ పథకాలే ఆయనకు ఆదర్శం. అందుకే నిత్యం జనంలో ఉంటూ, ప్రజల మంచి కోసం పరితపిస్తుంటారు. ఆయనే చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎంసీ.విజయానందరెడ్డి. సోమవారం విజయానందరెడ్డి జన్మదినం నేపథ్యంలో ప్రత్యేక కథనం..

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో విజయానందరెడ్డికి 13 ఏళ్ల ప్రత్యేక అనుబంధం ఉంది. 2009లో వైఎస్.జగన్ పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యేనాటికి విజయానందరెడ్డికి మంచి పరిచయాలు ఉన్నాయి. ఓదార్పుయాత్ర చిత్తూరు జిల్లాకు వచ్చినపుడు విజయానందరెడ్డి ఆయన వెంటే నడిచారు. నాటి ఉమ్మడి ఆంధ్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రేణిగుంటకు వస్తున్నారని తెలిసి దాదాపు 200 మందితో నిరసన వ్యక్తంచేసి పోలీసులచేత లాఠీ దెబ్బలు తిన్నారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి తొలిసారి చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ కూడలి వద్ద రైతు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించినపుడు అక్కడ ఏర్పాట్లన్నీ విజయానందరెడ్డి పర్యవేక్షించారు. జిల్లాలో తొలి వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని కొత్తపల్లె మిట్టలో ఏర్పాటు చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం విజయానందరెడ్డిపై తప్పుడు కేసులు పెట్టినా బెదరలేదు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆయన ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి స్ఫూర్తి చెందారు. సేవే తన మార్గమంటూ ఆయన బాటనే ఎంచుకున్నారు. నాలుగేళ్లుగా చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు మార్కెట్ గేటు రుసుమును దాదాపు రూ.3 కోట్లు చెల్లించారు. చిత్తూరు నగరంలో వ్యాపారం చేసుకునే ఏ ఒక్కరైతు, చిరు వ్యాపారి గేటు రుసుం చెల్లించకుండా ఆ మొత్తాన్ని తానే భరించారు. 35 మంది నిరుపేద విద్యార్థులకు ఎల్‌కెజీ నుంచి నుంచి బీ.టెక్, ఎంసీఏ వరకు తానే ఫీజు భరిస్తూ ఉచిత విద్య అందిస్తున్నారు. వీరిలో ఐదుగురిని విదేశాల్లో చదివిస్తుండడం గమనార్హం.

జగనన్నే స్ఫూర్తి

జగనన్న సైన్యంలో నేనో సైనికుడిని. నాలాంటి సామాన్య కార్యకర్తను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయి పదవి ఇచ్చారు. ఆయనే నాకు స్ఫూర్తి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అనుక్షణం వెన్నంటే ఉంటూ నన్ను ప్రోత్సహిస్తున్నారు. చిత్తూరు ప్రజల ఆశీస్సులు తప్ప మరేమీ కోరుకోను. నాకు నీడనిచ్చిన వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతా. ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తా.

– ఎంసీ విజయానందరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్

నిరుపేదలకు ఉచిత తోపుడు బండ్లు

తన రాజకీయ గురువుగా ఉన్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఉన్న అభిమానంతో దాదాపు రూ.2 కోట్లు ఖర్చుచేసి నిరుపేదలకు ఉచిత తోపుడు బళ్లు, బంకు అంగడి, కిరాణా దుకాణాలు పెట్టించారు. చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.30 లక్షలతో పిరమిడ్ ధ్యాన మందిరం, యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ పీఎల్‌ఆర్–వీఎస్‌ఆర్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తూ మూడేళ్లలో రూ.3 కోట్లు ఖర్చు చేసి భారీ ప్రైజ్ మనీకూడా ఇస్తున్నారు. రెండేళ్లుగా 9500 ముస్లిం కుటుంబాలకు రూ.4 కోట్ల వ్యయంతో రంజాన్ తోఫా, కరోనా సమయంలో క్వారైంటైన్‌లో ఉన్న బాధితులకు ఉచితంగా 500 ఫ్యాన్లు వితరణ, నెల పాటు ఉచిత భోజన వసతి, తిరుపతి కేంద్రంగా జరిగిన నిడ్జం క్రీడలకు నాటి కలెక్టర్‌కు రూ.20 లక్షల చెక్కును అందించారు. ఇక వరదలు వచ్చి పలురోడ్లు దెబ్బతింటే తన సొంత నిధులతో చిత్తూరు ఓవర్ బ్రిడ్జిని బాగుచేయించారు. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో ప్రజలకు ఉచిత శుద్ధినీటి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. చిత్తూరులో వరదలు వచ్చిన వేళ.. తానున్నానంటూ నిత్యావసర వస్తువులు అందచేశారు. ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంట నడవడమే తప్ప మరేమీ తనకు తెలియదంటున్నారు.

ఐటీ హబ్

చదువుకున్న యువతకు ఉన్న ప్రాంతంలోనే విద్యావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా ఓ మారుమూల పల్లెటూర్లో ఐటీ హబ్ కంపెనీ రావడంలో విజయానందరెడ్డి కీలక పాత్ర పోషించారు. స్మార్ట్ డీవీ కంపెనీని చిత్తూరు నగరానికి 6 కి.మీ దూరంలో ఉన్న కొట్బార్లపల్లె వద్ద నిర్మించడానికి కృషి చేసిశారు. స్మార్ట్ డీవీ కంపెనీ చైర్మన్ దీపక్ తలను ఒప్పించి ఐటీ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ దాదాపు 4,500 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నారు.


కొట్బార్లపల్లె వద్ద నిర్మిస్తున్న స్మార్ట్ డీవీ ఐటీ కంపెనీ


చిత్తూరులో పార్లమెంటు ప్యానల్ స్పీకర్ మిథున్‌రెడ్డి చేతులు మీదుగా రంజాన్ తోఫాను అందచేస్తున్న విజయానందరెడ్డి


నిరుపేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ విజయానందరెడ్డి


జననేతకు
జన్మదిన
శుభాకాంక్షలు
నిగర్వి, నిరాడంబరులు,
మా ఆత్మీయులు, శ్రేయోభిలాషి
అత్యంత ఆప్తులు , ప్రజల మనిషి
శ్రీ ఎం.సి.విజయానందరెడ్డి
రాష్ట్ర వైస్ చైర్మెన్, డైరెక్టర్,
APSRTC క్యాబినెట్ హోదా గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
వీరు ఇలాంటి జన్మదినోత్సవాలు
మరిన్ని జరుపుకోవాలని ఆ కలియుగ దైవం
శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్వ ఆశీస్సులు
మీ పై ఎల్లవేళలా ఉండాలని మరెన్నో ఉన్నత పదవులు
పొందాలని కోరుకుంటూ...
With Best Compliments from
R.SACHIN PRAKASH
Managing Director.